క్లుప్తంగా

న్యాయమైన సమస్యలు పరిష్కరించండి

హుడాకాంప్లెక్స్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సరూర్‌నగర్ సీడీపీఓ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి, సమ్మె విరమింపచేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అలాగే, బీఎల్ఓ డ్యూటీలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎంతో కాలంగా పనిచేస్తున్నా అంగన్‌వాడీలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించలేదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు గంగ సుకన్యకుమారి, గౌరమ్మ, సరోజ, రబియా సుల్తానా, లక్ష్మి, పద్మ, రేఖ, సుజాత, అరుణ, నిర్మల, రేణుక, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

రఘుమారెడ్డి కాంగ్రెస్‌లో చేరడం సరికాదు

మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు రాజునాయక్



మహేశ్వరం: కోరుపోలు రఘుమారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం సరికాదని మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు, సర్పంచ్ మెగావత్ రాజు నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి రఘుమారెడ్డికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, అయినా పార్టీని వీడారని అసహనం వ్యక్తం చేశారు. రఘుమారెడ్డికి ఏమి అన్యాయం చేశారని పార్టీ మారారని ప్రశ్నించారు. మంత్రి, రఘుమారెడ్డికి మండలంలో మొదటి ప్రాధాన్యత ఇచ్చి గౌరవించారన్నారు. నమ్మి ఎంపీటీసీ, ఎంపీపీ పదవులను అప్పగిస్తే పార్టీ మారి నమ్మక ద్రోహం చేశారని మండిపడ్డారు.

కొనసాగుతున్న ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

తుక్కుగూడ : మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూంలను స్థానికులకు కేటాయించాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా బుధవారం కూడా కొనసాగింది. వార్డు కార్యాలయం వద్ద నోటికి నల్ల దుస్తులను కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. తమ గ్రామ రైతు భూముల్లో నిర్మించిన ఇళ్లు నగరవాసులకు ఇచ్చి, తమ గ్రామానికి చెందిన నిరుపేదలకు ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం



దేవుని పడకల్ వైద్య శిబిరంలో సర్పంచ్, నాయకులు, తదితరులు

తలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహణ అభినందనీయమని సర్పంచ శ్రీశైలం అన్నారు. నిరుపేదలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం మండలంలోని దేవుని పడకల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో గ్రామీణులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేక పోతున్నారని పేర్కొన్నారు. శిబిరంలో 75 మందికి బీపీ, షుగర్ తదితర వ్యాధులకు చికిత్సలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అంజయ్య, అంజిరెడ్డి, నాయకులు భిక్షపతి, శంకర్, రమేష్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పురపాలక కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటింటా చెత్త సేకరణ క్రమం తప్పకుండా చేయాలని , డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందిని కోరా రు. తుర్కయంజాల్, రాగన్నగూడలోని నై కాలువ, కుంట సాయిరెడ్డి నగర్, తిరుమల కాలనీ, శ్రీశ్రీ విహార్ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లోని కుంటల్లో ఆయిల్ బాల్స్ వేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఖాళీ కుండీలు, పా త టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- పకడ్బందీగా మండపాల ఏర్పాటు
- జాగ్రత్తలతో ప్రమాదాలకు చెక్



నిమజ్జనానికి తరలుతున్న బాలాపూర్ గణనాథుడు (ఫైల్)

పహాడీషరీఫ్: వినాయక చవితి ఉత్సవాలకు పక్షం రోజుల ముందు నుంచే పండుగ వాతావరణం నెలకొంటుంది. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అంతా కలిసి కట్టుగా జరుపుకొనే ఈ పండుగ అందరిలో జోష్ నింపుతోంది. మండప నిర్వాహకులు, పోలీస్, మున్సిపాలిటీ, జలమండలి, విద్యుత్ అధికారులంతా చవితికి పక్షం రోజుల ముందు నుంచే ఏర్పాట్లలో తలమునకలు కావాల్సి వస్తుంది. ఉత్సవాల సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీసులు మండప నిర్వాహకులతో శాంతి సమావేశాలు నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలను పాటించని కారణంగా ప్రతి ఏటా ఎక్కడో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉంటున్నాయి. అప్రమత్తంగా ఉండడమే 'శ్రీరామ రక్ష' అని పోలీసులు పలు సూచనలను చేస్తున్నారు.

పకడ్బందీగా మండపాల ఏర్పాటు..

- మండపాలకు నాణ్యమైన కర్రలు, ఇనుప పైపులు, రేకులను వినియోగించి పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలి.దీంతో గాలి, దుమారం వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బంది ఉండదు.
- గణనాథుడి వద్ద దీపాలు వెలిగించడాన్ని దృష్టిలో ఉంచుకొని అగ్నికి అంటుకునే స్వభావం కలిగిన వస్త్రాలు, పూలదండలు, అలంకరణ సామగ్రి, పెట్రోల్, కిరోసిన్ లాంటి వాటిని ఉంచరాదు.
- అలాగే, విద్యుత్ తీగల ముందు మండపాలను ఏర్పాటు చేయొద్దు. నిమజ్జనానికి తరలించే సమయంలో గణనాథుడిని వాహనంలోకి ఎక్కించే క్రమంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.

విద్యుత్ ప్రమాదాలపై దృష్టి..

మండపాల నిర్వాహకులు ఎక్కువ మంది అధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోకుండా స్తంభాలకు వైర్లను వేలాడదీస్తుంటారు. విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఇక్కడే బీజం పడుతుంది. వదులుగా ఉన్న వైర్లు గాలి, వానకు కింద పడి విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తాయి. ఇలా కాకుండా అధికారిక కనెక్షన్ తీసుకోవడం ద్వారా విద్యుత్ అధికారులు అక్కడికి వచ్చి స్తంభం నుంచి కనెక్షన్‌ను ఇస్తారు. ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తినా వెంటనే వారు స్పందిస్తారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంఖాల్‌లో గతంలో ముగ్గురు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందారు.

భక్తిని మాత్రమే ప్రదర్శించాలి.

వినాయక చవితి ఉత్సవాలలో నిర్వాహకులు భక్తిరసమైన పాటలను మాత్రమే పెట్టాలి. అలా కాకుండా సినిమా పాటలు పెట్టి పవిత్రతను దెబ్బతీయరాదు. దీంతో పాటు ఉత్సవాలు కొనసాగినన్నీ రోజులు నిర్వాహకులు మద్యం, మాంసాహారానికి దూరంగా ఉండి పూజాలు చేయాలని గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు సూచిస్తున్నారు.

బాలాపూర్ గణేశ్ వద్ద గట్టి బందోబస్తు



బాలాపూర్ గణేష్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తాం. అందరి సహకారంతో గతంలో మాదిరిగానే ఈ సారి కూడా శాంతియుతంగా పూర్తి చేస్తాం. ఇప్పటికే మండపాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి సూచనలు చేశాం. బందోబస్తు ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రతిమల ప్రతిష్ఠకు సంబంధించి మండపాల నిర్వాహకులు తమకు సమాచారం ఇవ్వాలి. రాత్రి పూట ఇద్దరు నిర్వాహకులు తప్పనిసరిగా మండపం వద్ద ఉండాలి. దీపం ఆరిపోకుండా, లడ్డూ మేకలు, ఇతర జంతువులు తినకుండా కాపాలాగా ఉండాలి. బాలాపూర్ గణనాథుడి వద్ద తమ సిబ్బంది రౌండ్ ది క్లాక్ బందోబస్తులో ఉంటారు.

– బి.వెంకట్ రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్

పోలీసుల సూచనలు పాటించాలి



మండపాల నిర్వాహకులు తమకు సహకరించి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి. తమ పరిధిలోని గణనాథులను ఎక్కువ జల్‌పల్లి చెరువులోనే నిమజ్జనం చేస్తారు. డీజేలకు అనుమతి లేదు. జల్‌పల్లి, తుక్కుగూడ, సర్దార్‌నగర్, మంఖాల్, శ్రీరాంకాలనీ, పహాడీషరీఫ్‌లలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తాం.

– కె.సతీష్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్

కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి లేదు

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్



విలేఖరులతో మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి బీఆర్ఎస్‌నేత కామేశ్‌రెడ్డికి లేదని బడంగ్‌పేట కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డికి రాగాలు పాడుకోగానీ, కాంగ్రెస్‌ను పార్టీని విమర్శించే స్థాయి లేదని దుయ్యబట్టారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు వంగేటి ప్రభాకర్‌రెడ్డికి ఉన్న రాజకీయ అనుభవం అంతా వయసు లేదు ఆయనను విమర్శిస్తావాని? కామేశ్‌రెడ్డిని ప్రశ్నించారు. సుందరీకరణ పనుల పేరుతో కాంట్రాక్టులు పొంది కోట్లు స్వాహా చేసి చెరువులను గాలికి ఒదిలివేసిన నీవు విమర్శలు చేస్తావా అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే పుట్టగతులుండవని హెచ్చరించారు. కార్యక్రమంలో సామ వరుణ్‌రెడ్డి, రంజిత్, దీక్షిత్, రజినీకాంత్, శ్రీదర్, అజయ్, రవి, సుజిత్, మణికంఠ తదితరులున్నారు.

రెగ్యులరైజ్ చేయాలని సమ్మె నోటీసు



కమిషనర్‌కి సమ్మె నోటీసు అందజేస్తున్న ఉద్యోగులు

మీర్‌పేట: 15న కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న సమ్మెకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది బుధవారం కమిషనర్ అల్లూరి వాణికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ నుంచి కార్పొరేషన్ ఏర్పడే వరకు దాదాపు 216 మంది సిబ్బంది వివిధ విభాగాలలో కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, సూపర్‌వైజర్లు, పారిశుద్ధ్య, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, వర్క్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్లుగా 30 ఏళ్లగా పనిచేస్తున్నామని తెలిపారు. తాము ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించామని అన్నారు. అలాగే, కరోనా కష్టకాలంలోనూ కీలకంగా పనిచేశామని వివరించారు. ఉద్యమ సమయంలో ఔవుట్ సోర్సింగ్ అనే మాట వినపడదని చెప్పిన సీఎం కేసీఆర్, ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులరేజ్ చేయాలని కోరారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో అధ్యక్షుడు బి.సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.శంకరాచారి, కార్యదర్శి జీవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.వాసుదేవ్, సంయుక్త కార్యదర్శి కె.మహేందర్ ఉన్నారు.

కార్పొరేషన్ సమగ్రాభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ దుర్గ, తదితరులు

మేయర్ ఎం.దుర్గ

మీర్‌పేట: మంత్రి సహకారంతో మీర్‌పేట కార్పొరేషన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. బుధవారం 36వ డివిజన్ పరిధిలోని ఎంఎల్ఆర్ కాలనీలో రూ.51 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ దుర్గ మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలతో డివిజన్ల పరిధిలోని కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను దశలవారీగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ అల్లూరి వాణి, ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మల్లేష్ ముదిరాజ్, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ, తుర్కగూడ, కప్పపహాడ్ గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎంపీడీఓ వెంకటమ్మ బుధవారం ఒక ప్రకటనలతో తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంకు చెందిన కంచకట్ల రుక్కమ్మకు సీఎంఆర్ఎఫ్ నుంచి వైద్య ఖర్చులకు రూ. 60 వేలను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంజూరు చేయించారు. బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్ సమక్షంలో బాధితురాలికి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

నేడు ప్రత్యేక పూజలు

ఇబ్రహీంపట్నం: శ్రావణ మాస అమావాస్యను పురస్కరించుకొని గురువారం ఇబ్రహీంపట్నంలోని శ్రీ భవాని నాగలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ప్రమాదాల నివారణపై దృష్టి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ అధికారులు దృష్టి పెట్టాలని జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సాగర్‌రోడ్డు మాల్ నుంచి బీఎన్‌రెడ్డి నగర్ వరకు అతివేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కొంత మంది డ్రైవర్ల నిర్లక్ష్యం, అతి వేగంగా వాహనాలు నడపడం వల్ల అమాయ క ప్రజలు ప్రమాదాలకు గురై ప్రాణాలు కో ల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలు గు రోజుల కింద తక్కళ్లపల్లి మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేష్ దంపతుల ఇద్దరు కుమారులు ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ప్రమాదానికి గురి కావడం బాధ కలిగించిందన్నారు. నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

జైపాల్‌యాదవ్‌తోనే కల్వకుర్తి అభివృద్ధి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తోనే సాధ్యమని ఆమనగల్లు బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌పై జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి చేసిన ఆరోపణల ను ఖండించారు. ఎమెల్యే జైపాల్‌యాదవ్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 15 కోట్లు ఎమ్మెల్యే మంజూరు చేయించారని తెలిపారు. జాతీయ నాయకుడిగా చెప్పుకుంటున్న ఆచారి ఆమనగల్లుకు ఏమి తీసుకువచ్చారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మళ్లీ జైపాల్ యాదవ్ విజయం సాధించడం ఖాయమని చెప్పారు.

మేమంతా బీఆర్ఎస్, సబితమ్మ వెంటే..

ఘట్టుపల్లి బీఆర్ఎస్ నాయకులు



సబితారెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న నాయకులు

మహేశ్వరం: గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ పార్టీలోనే తామంత కొనసాగుతామని ఘట్టుపల్లి బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఘట్టుపల్లికి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు మంత్రి సబితారెడ్డిని కలిసి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతామని పేర్కొన్నారు. రఘుమారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో లేదన్నారు. తాము సబితమ్మతోనే ఉంటామని ప్రయాణం చేస్తామని తెలిపారు. ఘట్టుపల్లి డబుల్ రోడ్డు నిర్మాణానికి, తండాల రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.25 కోట్ల నిధులు మంత్రి ఇచ్చిందన్నారు. రఘుమారెడ్డిని తమ గ్రామం నుంచి ఎంపీటీసీగా గెలిపిస్తే మండలంలో అత్యంత గౌరవప్రదమైన ఎంపీపీ పదవిని ఇస్తే నమ్మించి మోసం చేసి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులందరం ఏక నిర్ణయంతో బీఆర్ఎస్‌లోనే ఉండాలని నిర్ణయించుకున్నామన్నారు. రఘుమారెడ్డి వెంట ఏ ఒక్క నాయకుడు, కార్యకర్త వెళ్లడం లేదని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఘట్టుపల్లి మాజీ ఎంపీటీసీ ఎస్.శ్రీశైలం, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ. సాదత్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాకేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సాదయ్య, నాయకులు ఎర్ర శంకరయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణనాయక్, మల్లేష్ యాదవ్, అంజయ్య, చంద్ర శేఖర్, ఎర్ర స్వామి, రాజు పలువురు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక బోనాలు



బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలిన మహిళలు

వీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: సాంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకని వీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండిలో బుధవారం నిర్వహించిన మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బోనాల వేడుకలలో భాగంగా బోనాల కుండలను రంగులతో, పసుపు కుంకుమలతో చూడముచ్చటగా అందంగా అలంకరించుకుని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పుల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, యువకుల నృత్యాలు మధ్య ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, సర్పంచ్ తులసీరాంనాయక్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, పుల్లయ్య గౌడ్, శ్రీరాములుగౌడ్, కేశవులుగౌడ్, శేషయ్యగౌడ్, నర్సింహగౌడ్, జంగయ్యగౌడ్, సత్తయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, రామస్వామి, రామకృష్ణ, బాలయ్య గ్రామ ప్రజలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా నారాయణ



నారాయణకు నియామకపత్రం అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి, నాయకులు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా మహేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు వత్తుల నారాయణ నియమితులయ్యారు. బుధవారం ఆయనకు కాంగ్రెస్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు పంపిణీ చేయలేదన్నారు. దళిత బంధు ఆశ చూపి కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులను బలవంతంగా బీఆర్ఎస్ పార్టీలో చేర్పించుకుంటున్నారని ఆరోపించారు. దళితుల సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎంతగానో కృషి చేసిందన్నారు. తనపైన నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రీతం, స్థానిక నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్, కృష్ణానాయక్, నాయకులు కుమార్, పాండురంగారెడ్డి, తిరుపతయ్య, ధన్‌రాజ్ గౌడ్, ప్రవీణ్, మంత్రి బాల్‌రాజ్, గాంసీరామ్ నాయక్, కృష్ణానాయక్, లాజర్, పాండు నాయక్, అంజయ్య, వినోద్ చారి, టైగర్ నర్సింహ, శేఖర్, పాండు, శశికాంత్, శ్రీకాంత్, సేవ్యానాయక్ పలువురు పాల్గొన్నారు.

కౌన్సిల్ అత్యవసర సమావేశం



మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: నిమజ్జన సౌకర్యాల కల్పనకు మున్సిపల్ కార్పొరేషన్ నిధుల నుంచి సుమారు రూ. 76 లక్షలు ఖర్చు అంచనతో కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. బుధవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అత్యవసర కౌన్సిల్ సమావేశం మేయర్ చిగురింత పారిజాత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, కార్పొరేటర్లు గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. గణనాథులు నిమజ్జనాలు జరిగే చెరువుల వద్ద లైటింగ్, క్రేన్‌లు, సెక్యూరిటీ సిబ్బంది, మంచినీటి సౌకర్యాలు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జగ్రత్తలపై చర్చించారు. అందరి ఆమోదంతో రూ.76 లక్షలు సాధారణ నిధుల నుంచి కేటాయించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సుమన్‌రావు, పలు పార్టీల ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు డీఈఈలు అశోక్‌రెడ్డి, జ్యోతి, ఏఈఈలు బిక్కునాయక్, వినీల్‌గౌడ్, మేనేజర్ నగేష్‌బాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించండి



చలో ఇందిరా పార్కుకు తరలివెళ్తున్న కార్మికులు

కందుకూరు: మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన చలో ఇందిరా పార్క్ నిరసన కార్యక్రమానికి సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని, పీఎఫ్ సౌకర్యంతో పాటు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించి, అందరిని ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు గీత, మంగ, ప్రభావతి, భారతమ్మ, బాలమణి, అండాలు, అలివేలు, లావణ్య, పుష్పలత, శ్రావణి పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లో బదిలీలు నిర్వహించాలని వినతి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్



జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతీమసింగ్‌కు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ.. ఎస్‌జీటీలు 2000 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేశారని, వీరు వేల ఆప్షన్లు ఎన్నుకోవడం చాలా కష్టమన్నారు. కావునా ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్ విధానంలోనే కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. లేని పక్షంలో దశల వారీగా రోజుకు 300 మంది ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు. జిల్లాలోని అన్ని క్యాడర్ల ఉపాధ్యాయ ఖాళీలను పూర్తిగా ఆన్‌లైన్‌లో పొందుపరిచిన తర్వాతే వెబ్ ఆప్షన్లు పొందుపరచడానికి అవకాశం ఇవ్వలన్నారు. కార్యక్రమంలో పరమేష్, నందిగామ మండల అధ్యక్షుడు రాఘువేందర్, తిరుమలేష్, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. .